కేసీఆరే మూడోసారి సీఎం

- ఇక్కడ గెలిచే పార్టీయే అధికారంలోకి..
- ఎమ్మెల్సీ, స్టేషన్‌ఘన్‌పూర్ అభ్యర్థి కడియం

స్టేషన్‌ఘన్‌పూర్ బీఆర్ఎస్ పార్టీ కార్యాలయంలో మాట్లాడుతున్న కడియం శ్రీహరి

స్టేషన్ ఘన్‌పూర్, డిసెంబర్ 1: అసెంబ్లీ ఎన్నికల్లో బీఆర్ఎస్ భారీ విజయం సాధించి కేసీఆరే ముచ్చటగా మూడోసారి ముఖ్యమంత్రి అవుతారని ఆ పార్టీ స్టేషన్ ఘన్‌పూర్ అభ్యర్థి, ఎమ్మెల్సీ కడియం శ్రీహరి ధీమా వ్యక్తం చేశారు. శుక్రవారం జనగామ జిల్లా స్టేషన్‌ఘన్ పూర్ నియోజకవర్గ కేంద్రంలోని బీఆర్ఎస్ పార్టీ కార్యాలయంలో నియోజకవర్గ స్థాయి ప్రజాప్రతినిధులు, బీఆర్ఎస్ ముఖ్య నాయకులతో సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా కడియం మాట్లాడుతూ.. స్టేషన్‌ఘన్‌పూర్‌లో విజయం సాధించిన పార్టీనే రాష్ట్రంలో అధికారంలోకి వస్తుందని, ఈ ఆచారం 1957 నుంచి ఇలాగే కొనసాగుతున్నదని పేర్కొన్నారు. ఈ ఎన్నికల్లో కూడా ఇక్కడ బీఆర్ఎస్ విజయం సాధిస్తుంది కాబట్టి రాష్ట్రంలో కూడా బీఆర్ఎస్ అధికారంలోకి వస్తుందని జోస్యం చెప్పారు. కడియంతోనే అభివృద్ధి జరుగుతుందనే నమ్మకంతో నియోజకవర్గంలో సీపీఎం, సీపీఐ, టీడీపీతోపాటు అక్కడక్కడ బీజేపీ వారు కూడా సానుకూలంగా స్పందించిన ప్రతిపక్షాలు ఈ ఎన్నికల్లో బీఆర్ఎస్‌కు పరోక్షంగా సహకరించాయని కడియం తెలిపారు. కానీ సొంత పార్టీ వారే పరోక్షంగా బీఆర్ఎస్‌కు వ్యతిరేకంగా పనిచేశారని, ఆ ఆధారాలు కూడా తన వద్ద ఉన్నాయని కడియం వివరించారు. ఈ ఎన్నికల్లో ప్రత్యర్థుల తోపాటు సొంత పార్టీ వారిని కూడా ఎదుర్కోవాల్సి వచ్చిందని ఆవేదన వ్యక్తం చేశారు. ఎన్నికల్లో శక్తికి మించి పనిచేసిన వారిని గుర్తు పెట్టుకుంటానని, వారిని కుటుంబ సభ్యుల్లా, కంటికి రెప్పలా కాపాడుకుంటానని చెప్పారు. ఈ ఎన్నికల సమయంలో ఎవరినైనా మనసు నొప్పించేలా మాట్లాడితే మనస్ఫూర్తిగా క్షమించాలని, కోపంతో అనలేదని, అందులోని ప్రేమను కూడా చూడాలని బీఆర్ఎస్ శ్రేణులను కోరారు.

గోషామహల్‌లో బీఆర్ఎస్ గెలుపు ఖాయం

- పోలీస్ హౌసింగ్ కార్పొరేషన్ చైర్మన్, బీఆర్ఎస్ నియోజకవర్గ ఇన్‌చార్జి కోలేటి

హైదరాబాద్, డిసెంబర్ 1 (నమస్తే తెలంగాణ): గోషామహల్ అసెంబ్లీ సెగ్మెంట్‌లో బీఆర్ఎస్ గెలుపు ఖాయమైందని తెలంగాణ రాష్ట్ర పోలీస్ హౌసింగ్ కార్పొరేషన్ చైర్మన్, బీఆర్ఎస్ గోషామహల్ నియోజకవర్గ ఇన్‌చార్జి కోలేటి దామోదర్ ఒక ప్రకటనలో ధీమా వ్యక్తం చేశారు. నియోజకవర్గాన్ని దత్తత తీసుకొని అన్నివిధాలా అభివృద్ధి చేస్తామని, మరో గచ్చిబౌలిగా తీర్చిదిద్దుతామన్న మంత్రి కేటీఆర్ ఇచ్చిన హామీని నమ్మిన ఓటర్లు బీఆర్ఎస్‌కు మద్దతుగా నిలిచారని తెలిపారు. దీంతో బీఆర్ఎస్ అభ్యర్థి నందకిషోర్ బిలాల్‌కే అత్యధిక మంది ఓటేశారని తెలిపారు. మినీ భారత్‌గా పేరొందిన ఈ సెగ్మెంట్‌లో రెండు పర్యాయాలు గెలిచిన బీజేపీతో ఆశించిన ప్రగతి సాధించలేదనే ఆవేదన ఓటర్లలో ప్రస్ఫుటంగా కనిపించిందని పేర్కొన్నారు. ఉత్తరాదికి చెందిన వందలాది మంది వ్యాపారులు ఈ సారి బీఆర్ఎస్ వైపు నిలిచారని పేర్కొన్నారు.

మంత్రి కొప్పులకు హైకోర్టులో ఊరట

కాంగ్రెస్ అభ్యర్థి అడ్లూరి పిటిషన్ కొట్టివేత

హైదరాబాద్, డిసెంబర్ 1 (నమస్తే తెలంగాణ):సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి కొప్పుల ఈశ్వర్‌కు హైకోర్టులో ఊరట లభించింది. 2018లో జరిగిన శాసనసభ ఎన్నికల్లో ధర్మపురి నియోజకవర్గం నుంచి పోటీచేసిన ఆయన 441 ఓట్ల ఆధిక్యతతో గెలుపొందిన విషయం తెలిసిందే. ఈ విజయం చెల్లదని, కొప్పుల తన అఫిడవిట్‌లో వాస్తవాలను గోప్యంగా ఉంచడం తోపాటు ఎన్నికల్లో అక్రమాలకు పాల్పడ్డారని ఆరోపిస్తూ ఆయన సమీప ప్రత్యర్థి అడ్లూరి లక్ష్మణ్ (కాంగ్రెస్) దాఖలు చేసిన పిటిషన్‌ను కొట్టివేస్తున్నట్టు జస్టిస్ కే లక్ష్మణ్ శుక్రవారం ప్రకటించారు. వీవీప్యాట్లలోని ఓట్ల లెక్కింపులో అక్రమాలు జరిగాయన్న అభియోగాలకు డాక్యుమెంటరీ ఆధారాలను చూపకపోవడమే ఇందుకు కారణమని తీర్పులో స్పష్టం చేశారు. తాజాగా అసెంబ్లీ ఎన్నికల్లోనూ కొప్పుల, అడ్లూరి ధర్మపురిలో పోటీపడుతున్నారు.

ఎంపీడీవో, గ్రామ కార్యదర్శికి నాన్-బెయిలబుల్ వారెంట్లు

హైదరాబాద్ , డిసెంబర్ 1 (నమస్తే తెలంగాణ): మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా శామీర్‌పేట ఎంపీడీవోతోపాటు మాజీద్‌పూర్ గ్రామ కార్యదర్శికి హైకోర్టు నాన్-బెయిలబుల్ వారెంట్లు జారీ చేసింది. ఆక్రమణల తొలగింపుపై నివేదిక సమర్పించకపోవడం, నవంబర్ 18న వ్యక్తిగతంగా విచారణకు హాజరుకావాలన్న ఉత్తర్వులను పాటించకపోవడంతో హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ అలోక్ అరాధే, జస్టిస్ జే అనిల్‌కుమార్ ధర్మాసనం శుక్రవారం ఈ వారెంట్లు జారీ చేసింది. ఎన్నికల విధుల్లో ఉండటం వల్ల వ్యక్తిగతంగా విచారణకు హాజరుకాలేకపోయామన్న వారి వాదనను ధర్మాసనం తప్పుపట్టింది. ఈ నెల 11న జరిగే తదుపరి విచారణకు వారిద్దరినీ హాజరుపచేందుకు చర్యలు చేపట్టాలని జిల్లా ఎస్పీని ఆదేశించింది.

మహబూబ్‌నగర్‌లో మీడియాతో మాట్లాడుతున్న పర్యాటక శాఖ మంత్రి శ్రీనివాస్‌గౌడ్

ఎగ్జిట్ పోల్స్‌ను నమ్మొద్దు

- హ్యాట్రిక్ ముఖ్యమంత్రిగా కేసీఆర్ ప్రమాణం చేయడం పక్కా
- కాంగ్రెస్ కుల రాజకీయాలు, బీజేపీ మత రాజకీయాలతో ప్రజలకు నష్టం
- మీడియా సమావేశంలో క్రీడా శాఖ మంత్రి శ్రీనివాస్‌గౌడ్

మహబూబ్‌నగర్, డిసెంబర్ 1: బీఆర్ఎస్ శ్రేణులు, ప్రజలు ఎగ్జిట్ పోల్స్‌ను నమ్మొద్దని క్రీడా శాఖ మంత్రి శ్రీనివాస్‌గౌడ్ సూచించారు. ప్రజల గుండెల్లో బీఆర్ఎస్ అధినేత, సీఎం కేసీఆర్ పదిలంగా ఉన్నారని, మూడోసారి ముఖ్యమంత్రి కేసీఆరేనని మంత్రి స్పష్టం చేశారు. శుక్రవారం మహబూబ్‌నగర్ జిల్లా కేంద్రంలోని బీఆర్ఎస్ పార్టీ కార్యాలయంలో మాజీ మంత్రి చంద్రశేఖర్‌తో కలిసి శ్రీనివాస్‌గౌడ్ మీడియాతో మాట్లాడారు. కాంగ్రెస్ కుల, బీజేపీ మత రాజకీయాలు చేసి ప్రజలను ఇబ్బందులకు గురిచేశాయని విమర్శించారు. కాంగ్రెస్ నుంచి ఎమ్మెల్యేలుగా గెలిచే వారిని కర్ణాటక ఉప ముఖ్యమంత్రి డీకే శివకుమార్ బెంగళూర్‌లో ఉంచేందుకు ప్లాన్ చేయడం వెనుక ఆంతర్యం ఎటువైపు దారితీస్తుందని ప్రశ్నించారు. కాంగ్రెస్ నాయకుల నాటకాలు.. సురభి వాళ్లను మించి ఉన్నాయని ఎద్దేవా చేశారు. వందకు వందశాతం బీఆర్ఎస్ అధికారంలోకి రావడం ఖాయమని ధీమా వ్యక్తం చేశారు. 3వ తేదీన 8 గంటల్లోపే కాంగ్రెస్ పార్టీ వారు సంబురాలు చేసుకుంటారని, 9 గంటల తర్వాత బీఆర్ఎస్ శ్రేణులు నిజమైన సంబురాలు చేసుకుంటాయని తెలిపారు. హంగ్‌కు చాన్స్‌లేదని, హ్యాట్రిక్ పక్కా అని ధీమా వ్యక్తం చేశారు. 2018 ఎన్నికల్లోనూ ఇలాగే అన్నారని, చూస్తే మైండ్‌బ్లాక్ అయ్యేలా గులాబీ పార్టీకి 88 సీట్లు వచ్చాయని గుర్తు చేశారు. ప్రస్తుతం అందే సీన్ రిపీట్ అవుతుందని చెప్పారు. 71 నుంచి 81 సీట్లు రావడం పక్కా అన్నారు. హ్యాట్రిక్‌గా సీఎంగా కేసీఆర్ ప్రమాణ స్వీకారం చేస్తారని తెలిపారు. ఈ సమావేశంలో మున్సిపల్ చైర్మన్ నర్సింహులు, వైస్ చైర్మన్ గణేశ్, గ్రంథాలయ సంస్థ జిల్లా చైర్మన్ రాజేశ్వర్‌గౌడ్, నాయకులు పాల్గొన్నారు.

జనగామలో బీఆర్ఎస్ గెలుపు తథ్యం

- గౌరవప్రదంగా గెలుస్తామన్న విశ్వాసం ఉంది
- కాంగ్రెస్ భౌతిక దాడులపై ఈసీకి ఫిర్యాదు
- మీడియా సమావేశంలో బీఆర్ఎస్ అభ్యర్థి పల్లా

జనగామలోని బీఆర్ఎస్ పార్టీ కార్యాలయంలో మీడియా సమావేశంలో మాట్లాడుతున్న బీఆర్ఎస్ అభ్యర్థి, ఎమ్మెల్సీ పల్లా రాజేశ్వర్‌రెడ్డి. చిత్రంలో ఎమ్మెల్యే డాక్టర్ తాటికొండ రాజయ్య తదితరులు

జనగామ, డిసెంబర్ 1 (నమస్తే తెలంగాణ): జనగామలో డిసెంబర్ 3వ తేదీన బీఆర్ఎస్ గెలిచి గులాబీ జెండా ఎగరడం తథ్యమని, ఆ నమ్మకం, విశ్వాసం తనకుందని ఆ పార్టీ ఎమ్మెల్యే అభ్యర్థి, ఎమ్మెల్సీ డాక్టర్ పల్లా రాజేశ్వర్‌రెడ్డి ధీమా వ్యక్తం చేశారు. శుక్రవారం బీఆర్ఎస్ పార్టీ జిల్లా కార్యాలయంలో స్టేషన్‌ఘన్‌పూర్ ఎమ్మెల్యే డాక్టర్ తాటికొండ రాజయ్య, జడ్పీ చైర్మన్ పాగాల సంపత్‌రెడ్డితో కలిసి మీడియా సమావేశంలో మాట్లాడారు. పోలింగ్ రోజు కాంగ్రెస్, బీజేపీ, సీపీఎం నాయకులు దౌర్జన్యంతో గులాబీ పార్టీ గెలుపును అడ్డుకోవాలని బీఆర్ఎస్ కార్యకర్తపై భౌతికదాడులకు దిగారని ఆరోపించారు. బీజేపీ అభ్యర్థి దశమంత్‌రెడ్డి చిన్నపిల్లల మాదిరిగా కృష్ణప్రసాద్ అనే కార్యకర్తను కొట్టడం, కాంగ్రెస్ అభ్యర్థి కుమారుడు రాకేశ్‌రెడ్డి దౌర్జన్యానికి దిగడం, సీపీఎంకు చెందిన బూడిద గోపి రౌడీ, గూండాల్లా ప్రవర్తించిన తీరును తీవ్రంగా ఖండిస్తున్నట్టు పల్లా పేర్కొన్నారు. ఏదైనా అభ్యంతరం ఉంటే అధికారులకు ఫిర్యాదు చేసి చట్టపరమైన చర్యలు తీసుకోవాలి తప్ప దాడులకు దిగడం శోచనీయమని, దీనిపై ఎన్నికల సంఘానికి ఫిర్యాదు చేసినట్టు వెల్లడించారు. పార్టీ లైన్‌కు కట్టుబడి 45 రోజులు నాయకులు, కార్యకర్తలంతా ఐక్యంగా పని చేసిన ఫలితంగానే జనగామలో బీఆర్ఎస్‌ను గెలిపించుకోబోతున్నామని స్పష్టం చేశారు. రాత్రనక, పగలక పార్టీ కోసం పనిచేసిన శ్రేణులకు శిరస్సు వంచి నమస్కరిస్తున్నానని పల్లా చెప్పారు. భవిష్యత్‌లో కూడా ఇదే స్ఫూర్తితో పనిచేద్దామని కోరారు. చాలా గౌరవప్రదంగా బీఆర్ఎస్ పార్టీ గెలువబోతుందని, ఇందులో ఎవరికీ ఎలాంటి అనుమానం లేదని ధీమా వ్యక్తం చేశారు. ఇతర జిల్లాల నుంచి మిత్రులు, శ్రేయోభిలాషులు, అభిమానులు వచ్చి తన కోసం పని చేశారని, వారందరికీ పల్లా రాజేశ్వర్‌రెడ్డి పేరుపేరునా కృతజ్ఞతలు తెలిపారు.

రజత్‌కుమార్‌కు ఘనవీడ్కోలు

హైదరాబాద్, డిసెంబర్1 (నమస్తే తెలంగాణ): సాగునీటి పారుదలశాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శిగా ఉద్యోగ విరమణ పొందిన రజత్‌కుమార్‌కు ఇంజినీర్లు ఘన వీడ్కోలు పలికారు. శుక్రవారం హైదరాబాద్‌లోని జలసౌధలో శుక్రవారం ఆయనకు వీడ్కోలు సమావేశాన్ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా పలువురు సాగునీటిశాఖ ఇంజినీర్లు మాట్లాడుతూ రజత్‌కుమార్ సేవలను కొనియాడారు. అనంతరం రజత్‌కుమార్ మాట్లాడుతూ విధినిర్వహణలో సహకరించిన ఇంజినీర్లు అందరికీ ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. సమావేశంలో ఈఎన్సీ మురళీధర్, నాగేందర్‌రావు, సీఎం ఓఎస్డీ శ్రీధర్‌రావు దేశ్‌పాండే తదితరులు పాల్గొన్నారు.

22 ప్రత్యేక రైళ్ల పొడిగింపు

సికింద్రాబాద్, డిసెంబర్ 1 (నమస్తే తెలంగాణ): దక్షిణ మధ్య రైల్వే జోన్ ఆధ్వర్యంలో ప్రస్తుతం కొనసాగుతున్న 22 ప్రత్యేక రైళ్లను తిరిగి పొడిగిస్తూ శుక్రవారం రైల్వే జోన్ అధికారులు నిర్ణయం తీసుకున్నారు. సికింద్రాబాద్ –దర్‌బంగ్, హైదరాబాద్– గోరక్‌పూర్, సికింద్రాబాద్– ధనపూర్, మధురై –కాచిగూడ, నాగర్‌సోల్– కాచిగూడ వంటి పలు రైల్వే స్టేషన్ల మధ్యలో ప్రత్యేక రైళ్లను పొడిగించారు. ఈ నెల 4 నుంచి ఫిబ్రవరి 2వ తేదీ వరకు షెడ్యూల్ వారీగా ప్రత్యేక రైళ్ల రాకపోకలు కొనసాగుతాయి.

పోలీస్ కిష్టయ్య కుటుంబానికి సర్కారు అండ

- శాసనమండలి డిప్యూటీ చైర్మన్ బండా ప్రకాశ్ ముదిరాజ్
- అమరుడు కిష్టయ్య 14వ వర్ధంతి.. పలువురు నివాళులు

హిమాయత్‌నగర్‌లో పోలీస్ కిష్టయ్య చిత్రపటానికి నివాళులర్పిస్తున్న డాక్టర్ బండా ప్రకాశ్ ముదిరాజ్

హిమాయత్‌నగర్, డిసెంబర్ 1: మలిదశ తెలంగాణ ఉద్యమంలో ఆత్మబలిదానం చేసుకున్న పోలీస్ కిష్టయ్య ముదిరాజ్ పోరాటం స్ఫూర్తిదాయకమని శాసనమండలి డిప్యూటీ చైర్మన్, తెలంగాణ మదిరాజ్ మహాసభ రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ బండా ప్రకాశ్ ముదిరాజ్ పేర్కొన్నారు. పోలీస్ కిష్టయ్య 14వ వర్ధంతి సందర్భంగా శుక్రవారం హిమాయత్‌నగర్‌లో ఆయన చిత్రపటానికి పలువురు పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా బండా ప్రకాశ్ ముదిరాజ్ మాట్లాడుతూ కిష్టయ్య కుటుంబానికి బీఆర్ఎస్ ప్రభుత్వం అన్ని విధాలుగా అండగా ఉన్నదని చెప్పారు. అమరవీరుల ఆశయాలకు అనుగుణంగా రాష్ట్రాన్ని సర్వతోముఖాభివృద్ధి వైపు నడిపించడంలో బీఆర్ఎస్ ప్రభుత్వం సఫలమైందని స్పష్టం చేశారు. సీఎం కేసీఆర్ నాయకత్వంలో గత పదేండ్లలో దేశంలోనే తెలంగాణ రాష్ట్రం అభివృద్ధిలో ప్రథమ స్థానంలో నిలిచిందని కొనియాడారు. కార్యక్రమంలో తెలంగాణ ఫిషరీస్ ఫెడరేషన్ చైర్మన్ పిట్టల రవీందర్ ముదిరాజ్, తెలంగాణ మదిరాజ్ మహాసభ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి డాక్టర్ గుండ్లపల్లి శ్రీను ముదిరాజ్, రాష్ట్ర ఉపాధ్యక్షుడు బల్ల సత్తయ్య, లీగల్ సెల్ సలహాదారు చంద్రశేఖర్, నాయకులు కనకయ్య, రొయ్యల కృష్ణమూర్తి, చెరుకు సాంబరాజ్ తదితరులు పాల్గొన్నారు.

బీఆర్ఎస్ కౌన్సిలర్‌పై కాంగ్రెస్ గూండాయిజం

- మంచిర్యాలలో పీఎస్సార్ అనుచరుల దాడి
- నిందితుల అరెస్టుకు గులాబీ శ్రేణుల డిమాండ్

మంచిర్యాల ఓవర్ బ్రిడ్జిపై ధర్నా చేస్తున్న బీఆర్ఎస్ నాయకులు

గర్మిళ్ల, డిసెంబర్ 1: మంచిర్యాల జిల్లా కేంద్రంలో కాంగ్రెస్ పార్టీ ఎమ్మెల్యే అభ్యర్థి కొక్కిరాల ప్రేమ్‌సాగర్‌రావు అనుచరులు గూండాయిజానికి తెరలేపారు. బీఆర్ఎస్‌కు చెందిన 15వ వార్డు కౌన్సిలర్ శ్రీరాముల సుజాత–మల్లేశ్ ఇంటికెళ్లి వారిద్దరిపై దాడి చేసి అరాచకం సృష్టించారు. శుక్రవారం సాయంత్రం కాంగ్రెస్ పార్టీకి చెందిన కొందరు నాయకులు తనకు ఫోన్ చేశారని, తమ నాయకుడికి వ్యతిరేకంగా సోషల్ మీడియాలో ఎందుకు పోస్టులు పెడుతున్నావంటూ దుర్భాషలాడారని కౌన్సిలర్ సుజాత భర్త మల్లేశ్ తెలిపారు. అంతేకాదు.. తన ఇంటికి వచ్చి భార్య సుజాతతో పాటు ఇంట్లో ఉన్న మహిళలపై కూడా దాడి చేశారని చెప్పారు. తన చేతికి గాయమైందని, తనను చంపుతామని బెదిరిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. విషయం తెలుసుకున్న పట్టణ సీఐ ముస్కె రాజు సిబ్బంతో సంఘటనా స్థలానికి చేరుకుని పరిస్థితిని సమీక్షించారు. కాగా.. బీఆర్ఎస్ కౌన్సిలర్ సుజాత ఇంటిపై పీఎస్సార్ అనుచరులు దాడి చేసిన విషయం తెలుసుకున్న ఆ పార్టీ నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో కౌన్సిలర్ ఇంటికి చేరుకున్నారు. అక్కడి నుంచి స్థానిక ఓవర్ బ్రిడ్జిపైకి వచ్చి దాడికి పాల్పడిన కాంగ్రెస్ గూండాలపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తూ రాస్తారోకోకు దిగారు. పీఎస్సార్ డౌన్ డౌన్ అంటూ నినాదాలు చేశారు. అనంతరం వారు మాట్లాడుతూ.. కాంగ్రెస్ గూండాలను అరెస్టు చేసే వరకు ధర్నా విరమించేది లేదని భీష్మించారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ మున్సిపల్ చైర్మన్ పెంట రాజయ్య, కౌన్సిలర్లు సుదమల్ల హరిక్రిష్ణ, మంచిర్యాల ఎమ్మెల్యే కుమారుడు నడిపెల్లి విజిత్‌రావు, నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

టీటీడీతో సమావేశ తీర్మాన వివరాలివ్వండి

రాష్ట్ర పర్యాటకశాఖకు హైకోర్టు ఆదేశం

హైదరాబాద్, డిసెంబర్ 1 (నమస్తే తెలంగాణ): అధికారిక విధుల్లో భాగంగా తిరుమల తిరుపతి దేవస్థానాల అధికారులతో జరిగిన సమావేశం తీర్మానాలను సమర్పించాలని రాష్ట్ర పర్యాటక శాఖ ముఖ్య కార్యదర్శిని హైకోర్టు ఆదేశించింది. మహబూబ్‌నగర్ అసెంబ్లీ నియోజకవర్గ బీఆర్ఎస్ అభ్యర్థి, రాష్ట్ర మంత్రి వీ శ్రీనివాస్‌గౌడ్‌తో కలిసి తిరుమల వెళ్లినందుకు ఎన్నికల సంఘ అధికారులు తనను సస్పెండ్ చేయడం అన్యాయమంటూ పర్యాటక సంస్థ ఎండీ మనోహర్‌రావు దాఖలు చేసిన పిటిషన్‌పై హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ అలోక్ అరాధే, జస్టిస్ జే అనిల్‌కుమార్ ధర్మాసనం శుక్రవారం విచారణ జరిపింది. టీటీడీ దర్శన కోటా టికెట్ల సంఖ్యను పెంచాలని కోరేందుకు అధికారిక విధుల్లో భాగంగానే మనోహర్‌రావు తిరుమలకు వెళ్లారని ఆయన తరపు న్యాయవాది పేర్కొంటూ.. సస్పెన్షన్ ఉత్తర్వులను రద్దు చేయాలని కోరారు. దీంతో ఈ వ్యవహారంపై ముఖ్య కార్యదర్శి వాదనలను విన్న తర్వాత తగిన ఉత్తర్వులు జారీ చేస్తామని స్పష్టం చేసిన హైకోర్టు.. తదుపరి విచారణను ఈ నెల 4కి వాయిదా వేసింది.

బీజేపీ బెదిరింపులు.. బీఆర్ఎస్ కార్యకర్త ఆత్మహత్య

- ఓటర్లను ప్రలోభ పెడుతున్నావన్నందుకు మనస్తాపంతో బలవన్మరణం
- మృతదేహంతో ఆ పార్టీ నాయకుడి ఇంటి ముందు ధర్నా

మృతదేహంతో బీజేపీ నాయకుడి ఇంటి వద్ద ధర్నా చేస్తున్న కుటుంబ సభ్యులు; ఇన్‌సెట్‌లో తునిగండ్ల రాజాగౌడ్ (ఫైల్)

భీమ్‌గల్, డిసెంబర్ 1: ఎన్నికల్లో డబ్బులు పంచుతూ ఓటర్లను ప్రలోభపెడుతున్నావని, నీ అంతు చూస్తానని బీజేపీ నాయకులు బెదిరించడంతో బీఆర్ఎస్ కార్యకర్త ఉరేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. నిజామాబాద్ జిల్లా భీమ్‌గల్ మండలం బెజ్జోరా గ్రామానికి చెందిన బీఆర్ఎస్ నాయకుడు తునిగండ్ల రాజాగౌడ్ (45) బుధవారం గ్రామంలో ఎన్నికల ప్రచారం చేస్తుండగా.. అదే గ్రామానికి చెందిన బీజేపీ నాయకులు ఈర్ల లక్ష్మీప్రసన్న, నర్సు, మధు, మహేందర్ అడ్డుకొని వాగ్వాదానికి దిగారు. ఈ క్రమంలో బీజేపీ నాయకులు రాజాగౌడ్‌పై ఎన్నికల్లో ఓటర్లకు డబ్బులు పంచుతున్నారని ఆరోపణలు చేయడంతోపాటు చంపుతామని బెదిరించారు. మనస్తాపానికి గురైన రాజాగౌడ్ గురువారం మధ్యాహ్నం 2 గంటల ప్రాంతంలో ఇంట్లో ఎవరికీ చెప్పకుండా గ్రామ శివారులోని దేవి ఆలయ సమీపంలోని చెట్టుకు ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. దీంతో కుటుంబసభ్యులు బీజేపీ నాయకుల ఇంటి ముందు మృతదేహంతో శుక్రవారం ధర్నాకు దిగారు. సుమారు మూడు గంటలపాటు ఆందోళన చేశారు. పోలీసులు ఘటనా స్థలానికి చేరుకొని రాజాగౌడ్ కుటుంబ సభ్యులతో మాట్లాడారు. సంబంధిత వ్యక్తులపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హామీ ఇవ్వడంతో ఆందోళన విరమించారు. అనంతరం కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు బీజేపీ నాయకులపై కేసులు నమోదు చేసినట్టు ఎస్సై హరిబాబు తెలిపారు.

కెనరా బ్యాంక్ केनरा बैंक Canara Bank
భారత ప్రభుత్వ రంగ సంస్థ | भारत सरकार का उपक्रम | A Government of India Undertaking
సిండికేట్ सिंडिकेट Syndicate

హెడ్ ఆఫీస్., 112, జె. సి. రోడ్డు, బెంగళూరు-560 002
www.canarabank.com

కెనరా బ్యాంక్ వాటాదారులకు అభ్యర్థన

1. సెబీ రెగ్యులేషన్స్ – 2015కి సంబంధించిన రెగ్యులేషన్ 40(1) (లిస్టింగ్ ఆబ్లిగేషన్స్ అండ్ డిస్‌క్లోజర్ రిక్వైర్మెంట్స్) ప్రకారం, ఫిజికల్ మోడల్‌లోని సెక్యూరిటీలను ట్రాన్స్‌ఫర్ చేయడమనేది ఏప్రిల్ 01, 2019 నుండి నిలిపివేయడమైనది. దీనిప్రకారం, డీమెటీరియలైజ్డ్ (డీమ్యాట్) రూపంలోని షేర్లను మాత్రమే ట్రాన్స్‌ఫర్ చేయడం వీలవుతుంది.

2. అలాగే, 25 జనవరి 2022 నాటి సెబీ సర్క్యులర్ నం. SEBI/HO/MIRSD/MIRSD_RTAMB/P/CIR/2022/8 ప్రకారం, డూప్లికేట్ షేర్ సర్టిఫికేట్, ట్రాన్స్‌మిషన్, ట్రాన్స్‌పోజిషన్ మొదలైన వాటి కోసం అభ్యర్థనలు ప్రాసెస్ చేసే సమయంలో, లిస్టెడ్ కంపెనీలు ఇకపై సెక్యూరిటీలను డీమ్యాట్ రూపంలో మాత్రమే జారీ చేయాలి.

3. పై కారణాల దృష్ట్యా, భౌతిక రూపంలో షేర్లు కలిగి ఉన్న బ్యాంక్ వాటాదారులందరూ దయచేసి వారి షేర్లను డీమెటీరియలైజ్ చేయాల్సిందిగా మేము అభ్యర్థిస్తున్నాము.

4. భౌతిక రూపంలో షేర్లు కలిగిన వాటాదారులందరూ వారి సంబంధిత పోర్ట్‌ఫోలియోల్లో అవసరమైన KYC వివరాలు అప్డేట్ చేయాల్సిందిగా సూచిస్తూ, వారందరికీ కెనరా బ్యాంక్ ఇప్పటికే ప్రత్యేక సమాచారం పంపింది. పైన పేర్కొన్న విషయానికి సంబంధించిన సర్క్యులర్లు మరియు అవసరమైన ఫారమ్ కాపీలను (ISR-1 నుండి 4 వరకు, ఫారమ్ SH-13 మరియు 14) బ్యాంక్ వెబ్సైట్ https://canarabank.com/shareholder-information మరియు దాని రిజిస్ట్రార్ మరియు ట్రాన్స్ఫర్ ఏజెంట్లు (RTA) వద్ద, అనగా, www.kfintech.comలో KFin టెక్నాలజీస్ లిమిటెడ్ వద్ద అందుబాటులో ఉంచడమైనది. ఓఇ అప్డేషన్ ఆవశ్యకత మరియు పోర్ట్‌ఫోలియోల ఫ్రీజింగ్ / రెఫరల్ తప్పించుకోవడం గురించి 17.11.2023 తేదీ నాటి SEBI/HO/MIRSD/POD-1/P/CIR/2023/181 అనే సర్క్యులర్‌లో సెబీ పునరుద్ఘాటించింది.

5. తేదీ 21.03.2013 నాటి సెబీ వారి నం. CIR/MRD/DP/10/2013 సర్క్యులర్ ప్రకారం, లిస్టెడ్ కంపెనీలన్నీ వాటి మదుపర్లకు చేసే అన్ని చెల్లింపులతో పాటు వాటాదారులకు అందించే డివిడెంట్లను RBI ఆమోదిత ECS [LECS (లోకల్ ECS) / RECS (రీజనల్ ECS) / NECS (నేషనల్ ECS], NEFT మొదలైన వాటి ద్వారా మాత్రమే అందించాలి. ఈ తేదీ వరకు కూడా తమ బ్యాంకు అకౌంట్ వివరాలు నమోదు చేసుకోని వాటాదారులందరూ ఆ వివరాలు నమోదు చేయాలని/ అప్డేట్ చేయాలని మేము అభ్యర్థిస్తున్నాము. దీనిప్రకారం, డీమ్యాట్ రూపంలో షేర్లు కలిగి ఉన్న బ్యాంకు వాటాదారులందరూ వారి బ్యాంకు అకౌంట్ వివరాల ఖచ్చితత్వాన్ని వారి డీమ్యాట్ సర్వీస్ ప్రొవైడర్‌తో ధృవీకరించుకోవాలని మరియు అవసరమైతే వాటిని అప్డేట్ చేయాలని మేము అభ్యర్థిస్తున్నాము.

6. దీనిప్రకారం, భౌతిక రూపంలో షేర్లు కలిగి ఉన్న వాటాదారులందరూ పైన పేర్కొన్న ఫారమ్‌లలో / ఫార్మాట్‌లలో వారి ఇ-మెయిల్ ఐడి(లు) మరియు/ లేదా బ్యాంకు అకౌంట్ వివరాలతో సహా అవసరమైన KYC వివరాలను ఇప్పటికింకా అందించకపోతే మా RTAకి క్రింది చిరునామాలో అందించాల్సిందిగా మేము అభ్యర్థిస్తున్నాము:

Kfin టెక్నాలజీస్ లిమిటెడ్ (Kfin), యూనిట్ : కెనరా బ్యాంక్, సెలేనియం
టవర్ B, ప్లాట్ నం.31-32, గచ్చిబౌలి, ఫైనాన్షియల్ డిస్ట్రిక్ట్, నానక్‌రామ్‌గూడ,
సేరిలింగంపల్లి, హైదరాబాద్ - 500032 [టోల్ ఫ్రీ నం.1800-309-4001,
ఇ-మెయిల్ : einward.ris@kfintech.com]

7. ఇప్పటివరకు తమ ఇ-మెయిల్ ఐడి(ల)ను వారి డీమ్యాట్ సర్వీస్ ప్రొవైడర్/మా RTA వద్ద నమోదు చేసుకోని కెనరా బ్యాంక్ వాటాదారులందరూ జనరల్ నోటీసులు స్వీకరించడానికి, ఇ-వోటింగ్‌లో పాల్గొనడానికి, వార్షిక నివేదిక మరియు ఇతర కమ్యూనికేషన్లను ఎలక్ట్రానిక్ రూపంలో స్వీకరించడానికి వారి ఇ-మెయిల్ ఐడి(ల)ను నమోదు చేసుకోవాల్సిందిగా మేము ఇందుమూలంగా అభ్యర్థిస్తున్నాము.

కెనరా బ్యాంక్ కోసం
సంతోష్ కుమార్ బాలిక్
కంపెనీ సెక్రటరీ

ప్రదేశం : బెంగళూరు
తేదీ : 02.12.2023

THE FEDERAL BANK LIMITED
Regd. Office: Aluva, Kerala.

ZONAL OFFICE: 1st Floor, Halcyon Complex, No.9, St Marks Road, Bangalore-560 001.
e-mail:bgrr-cpc@federalbank.co.in Ph:080-22074610//24/25